ఆఖరి డ్రాయింగ్ వేసి, కుర్చీలో సంతృప్తిగా కూలబడిన పుపుకు పొట్టిజడ లమ్మాయి ఫ్లాస్కులోని వేడి టీ అందించింది.

"క్షణాల్లో అన్నీ అద్భుతంగా మారిపోయేయి కామ్రేడ్స్!" అంది కువాంగ్ ఉత్సాహంగా।

"మమ్మల్నందర్నీ మీరు రుణగ్రస్తుల్ని చేసుకున్నారు సుమండీ!" అంది పొడుగమ్మాయి.

పుపు సిగ్గుపడిపోయేడు. వారు ముగ్గురూ తిరిగి ఆ డ్రాయింగుల్ని చూపుకుంటూ ఏమేమో చర్చించుకుంటూంటే అతను తీరిగ్గా చుట్టూ చూసేడు.

తననిక్కడికి తీసుకువచ్చిన ఆవిడ ఎప్పుడో వెళ్లిపోయినట్లుంది. తను గమనించనే లేదు. కువాంగ్ తన సహచరుల్తో ఏమో చెపుతోంది. కానీ, ఆ మెషీన్ల భాష తనకు సరిగా అర్థంగావటంలేదు.

టీ త్రాగుతూ ఏకాగ్రంగా వారినే పరిశీలిస్తున్న పుపు కళ్లు మెరిసేయి. అందగత్తె కాదనుకున్న కువాంగ్ అతని కళ్లకు గొప్ప అందంగా గోచరించసాగింది. ఆవిడ నిజ సౌందర్యం అతనికాక్షణంలో పట్టుబడిపోయింది. ఆవిడ కళ్లు విజయోత్సాహంతో వెలిగిపోతూ ఉన్నాయ్! ఆవిడ నుదిటిమీద స్వేదబిందువులు ముత్యాల్లా మెరిసిపోతూ ఉన్నాయ్! ఆవిడ చేతుల్లోని పెన్సిలూ, స్కేళ్లూ, ఆ పరిసరాలూ అన్నీ కలసి పుపు మనోపథంలో ఓ వర్ణచిత్రాన్ని ముద్రించేయి.

అకస్మాత్తుగా పుపుకు తాను అక్కడికెందుకు వచ్చిందీ గుర్తుకు వచ్చింది. మేనేజర్‌తో తానన్న మాటలు గుర్తుకొచ్చేయి.

అతను వెంటనే లేచి చప్పుడుకాకుండా తన స్టూల్‌ను సరైనచోటికి మార్చుకున్నాడు. కాన్వాస్ అందుకుని రంగులు కలుపుకోసాగేడు. చకచకా పని సాగించేడు.

అతనానాడు చిత్రించిన కువాంగ్ రూపచిత్రం పత్రికలో అచ్చయినాక మిత్రులు పుపును అభినందించేరు. అంతకుముందెన్నడూ అంతచక్కని రూపచిత్రం అతను వేసిఉండలేదని.

## భోగి - యోగి

'సాహితి'

అనగా అనగా ఒక వూరు. ఊరి కామందు పేరు కామయ్య. ఊళ్ళో సగం పొలాలన్నీ ఆయనవే. ఆయనకి మాగాణం భూములుండేవి. మెట్ట భూములుండేవి. ఇవన్నీ కాక పండ్లతోటలుండేవి. మామిడితోటలూ, జామి తోటలూ, సపోటాతోటలూ కూడా వుండేవి. ఆయన సాటివాళ్ళను మోసం చేస్తూనూ, బీదవాళ్ళను [illegible]చేస్తూనూ ఆస్తిని పదిరెట్లు పెంచేడు.

కామయ్యకి లేకలేక ఒక మగశిశువు కలిగాడు అతన్ని చాలా గారాబంగా ముద్దుమురిపాలతో పాలువెన్నలతో పెంచేరు కామయ్యా అతనిభార్యా. ఐదేళ్ళు వచ్చేక బడికి పంపేరు. బళ్ళో పంతులు, కామయ్య కొడుకు ఆ వూరి కామందు కొడుకు కాబట్టి ఒంటిమీద చెయ్యివెయ్యకుండా అక్షరాలూ, గుణింతాలూ, ఒంట్లూ ఎక్కాలూ వంటివి మప్పేరు. ఇంతకూ కామయ్య కొడుకుపేరు చెప్పనేలేదుకదూ! అతనికి భోగేశ్వరప్రసాదని నామకరణం చేసేరు. అంత ఆస్తిపాస్తులని అనుభవించటానికి పుట్టిన భోగికి మరోపేరెలా పెట్టగలరు వారు?

పదేండ్ల వయసు వచ్చేప్పటికి భోగేశ్వరప్రసాదు హైస్కూల్లో ఆరోక్లాసులో చేరేడు. హైస్కూల్లో చేరేక మొదటిరోజు స్కూలుకి పంపిస్తూ వాళ్ళమ్మ అతడికి స్నానం చేయించి, మీగడపెరుగూ, అతడికిష్టమైన కూరలతో సుష్టుగా అన్నంపెట్టి, చక్కగా తలదువ్వి, మంచిబట్టలు తొడిగి, అతడిచుట్టూ ఒకసారి దిష్టితీసి "మాబాబు బంగారుబాబు, కలెక్టరౌతాడు" అంటూ బడికి సాగనంపింది కామందు కామయ్యగారి కొడుకు కావటంచేత అతను సులభంగా ఆరు నుంచి ఏడులోకి వెళ్ళేడు. కాని మరి కొన్నాళ్ళకి కామయ్యకి పంతులుగారొక విషయం చెప్పేరు– "మీవాడికి చదువబ్బదు" అని. అందుచేత కామయ్య "నాకొడుకు కలెక్టరై వూళ్ళేలాలా, ఎంచక్కా వూళ్ళేలే కలెక్టర్లనే ఏలగలడు" అనుకొని భోగేశ్వరప్రసాదుని చదువు మాన్పించేడు.

కామందు కామయ్య ఇంటిముందు వాళ్ళ పాలేరు కష్టజీవి కన్నయ్య గుడిసెవేసుకుని వుండేవాడు. కష్టజీవి కన్నయ్యకు భోగేశ్వరప్రసాదు ఈడు కొడుకు వుండేవాడు. వాడిని రాముడు అని పిలిచేవాళ్ళందరూ. ప్రసాదు, రాముడు ఒకే ఈడువాళ్ళు కావటం వలన ఎప్పుడూ కలిసి తిరిగేవాళ్ళు.

ఏవిధమైన శ్రమా లేకపోవటంవలననూ, సోమరిగా వుండటంవల్లనూ, తల్లిదండ్రుల గారాబంవల్లనూ, సిరిసంపదలవలన కలిగిన సౌఖ్యాలవలననూ, భోగేశ్వరునిలో మొదట ఒకవిధమైన విచ్చలవిడితనం ప్రవేశించింది. చిత్రమైన మనస్తత్వం ఏర్పడింది. వూరికినే కూర్చోవటంవలన అతనికి అనేక కోరికలుకలిగేవి. అవన్నీకూడా తల్లిదండ్రులు తీరుస్తుండేవాళ్లు. దాన్నుంచి అతనికొక గాఢమైన అభిప్రాయంఏర్పడిపోయింది. తనకేవస్తువు కావాలన్నా తను కష్టించనక్కరలేదు. చెమట ధారపోయనక్కరలేదు. కూర్చుని అన్నికోరికలూ తీర్చుకోగలడు తను.

పన్నెండేళ్ల వయసప్పుడు భోగేశ్వరప్రసాదు ఒకానొక ఎండాకాలంమధ్యాహ్నం పూట చెలికాడు రాముడితో కలసి యింటికి దగ్గరున్న మామిడితోటకివెళ్ళేడు. మామిడి చెట్లన్నీ పిందెలతో సుమంగళులైన స్త్రీలలా బరువుగా నిల్చున్నాయి మామిడిపిందెలు చూడగానే అవి తినాలనిపించింది భోగేశ్వరుడికి. రాముడికి చెప్పేడాకోరిక. ఇద్దరూ

434

కలసి రాళ్లువేసేరు. రాళ్ళకి కాయలు రాలకపోవటంతో రాముడు చెట్టెక్కే ప్రయత్నం చేస్తున్నాడు. చేతులు నొప్పెట్టేదాకా భోగేశ్వరుడు రాళ్లు విసిరేదేకాని ఒక్క మామిడి పిందెకూడా సంపాదించలేకపోయేడు. ఈ లోపు రాముడు చెట్టెక్కిపోయి, ఒక కొమ్మమీద కూర్చుని మామిడిపిందె తెంపుకొన్నాడు.

"ఒరేయ్! రాముడూ ఒక కాయ కిందపడేయరా" అన్నాడు భోగేశ్వరుడు.

"చెట్టెక్కు. ఎన్నికావాలంటే అన్ని కోసుకోవచ్చు" అన్నాడు రాముడు మామిడి పిందె చర్మంకొరికి వూసేస్తూ.

"ఒక్కటంటే, ఒక్కటిరా"

"ఊహూ. ఎందుకివ్వాలినేను. చెట్టునేనెక్కేను. కాయలు నేను కోసుకుంటాను. కావాలంటే నువ్వూ ఎక్కు" అన్నాడు వాడు పుల్లటి మామిడిపిందెకండ నములుతూ. ఆలోచించి ఆలోచించి తిరుగులేని మంత్రం వుపయోగించేడు ప్రసాదు.

"ఉండు. మా అమ్మకు చెప్తాను" అన్నాడు

రాముడు "ప్రసాదుబాబూ, వొద్దు వొద్దు యివిగో కాయలు" అంటూ మామిడి పిందెలు కిందవేశేడు. కామయ్యభార్యంటే కన్నయ్యకూడా భయపడతాడు. మరిరాముడిదేముంది? అందుచేత వాడు కాయలు తెంపి పడేశాడు.

మరొకసారి...... ......

ప్రసాదుకి గులాబీలు. ఎర్రవి. ఎంతో చక్కనివి అంటే ఎంతో ఎంతోయిష్టం. వాళ్ళింట్లో గులాబీచెట్టులేదు. వాళ్ళ తోటలోనూలేదు, వాళ్ళ పక్కింట్లోనూలేదు. ఆ వూళ్ళో ఒక్క కరణంగారింట్లోతప్ప మరింకెక్కడా గులాబీమొక్క లేదంటే లేదు. అప్పుడప్పుడూ భోగేశ్వరప్రసాదు కరణంగారింటిముందు నుంచుని గులాబీ పువ్వుల్ని చూస్తూ గడిపేవాడు. ఎలాగైనా ఓ ఎర్రగులాబీ తెంపుకోవాలనిపించేది అతనికి. కాని గులాబీమొక్కలముందు చావిడిగుంజకి కట్టేసివున్న పెంపుడుకుక్కనిచూసి చమటపట్టి తిరిగి వచ్చేవాడు.

సరిగ్గా అలాంటి సమయంలో......

ఒకరోజు ప్రొద్దున రాముడు ఒక గులాబీమొక్కని పట్టుకొచ్చేరు. ఒంటికి గుంద్రదనాన్ని, ఓ ప్రత్యేక రూపాన్ని సంతరించుకుంటోన్న పదమూడేళ్ల బాలకుమారిలా వుందా మొక్క. రాముడు కరణంగారిభార్య చెప్పే చిల్లరమల్లరపనులన్నీ చేసిపెట్టి ఆ గులాబీమొక్కని సంపాదించేడు. రాముడికీ గులాబీలంటే యిష్టమే.

ఆ మొక్కకి ప్రోదిచేసి. నాటి. రక్షణకల్పించి కట్టుదిట్టంచేసేడు. మొక్క కొత్త ఆకులు తొడిగింది. రాముడూ, వాడి చెల్లెలూ గౌరీకూడా దానికి నీళ్లుపోస్తూ, ఆ మొక్కనేచూస్తూ చాలాచాలా ఆనందించేవాళ్ళు. ఆ మొక్క కొత్త ఆకువేస్తేనూ,

435

కొత్త రెమ్మవేస్తేనూ వాళ్ళిద్దరూ ఎంతో సంబరపడిపోయేవాళ్ళు. అలా దాన్ని వాళ్ళు ఎరువుపోసి, నీరుపోసి, కంటికి రెప్పలా, కన్నతల్లిలా సాకేరు. గులాబీమొక్కకి వయసొచ్చింది. వయసుతోపాటు ఒక్కటంటే ఒక్క మొగ్గతొడిగి సొగసుకూడా తెచ్చు కుంది. గౌరి, రాముడుపొందిన ఆనందానికి హద్దులేదు. వాళ్ళు ఆ మొగ్గవిచ్చేంతవరకూ కళ్ళన్నీ కాయలుచేసుకునిదాన్నే చూసేరు. మొగ్గవిచ్చింది. ఎర్రగులాబీనిచూసేక వాళ్ళ కళ్లు పూలుపూసేయి.

మరి ఆ మొక్క అలా ఎర్రగులాబీ పూయగా, రాముడు గౌరీ కళ్ళుకూడా పూలుపూయగా భోగేశ్వరప్రసాదు కళ్లుమాత్రం నిప్పులుపోసుకున్నాయి. అతని ఎర్ర గులాబీపై మక్కువంతా రాముడు, గౌరీలపై అక్కసుగా మారిపోయింది. అతనికా పూవుకావాలి. అతను గులాబీమొక్కని సంపాదించలేడు. పూలు పూయించలేడు. కాని పూవుమాత్రం కావాలి. కావాలి......

ఆరోజు రాముడు గౌరిని, గులాబీకి కాపలాపెట్టి అన్నం తినటానికి గుడిసెలోప లికి వెళ్ళేడు. గౌరి... అవును గౌరి ఏమైంది? కామయ్యగారి భార్య కనకమ్మగారు ఏదో పని పురమాయించేరు. మనసంతా గులాబీమీదేవున్నా, గౌరి తప్పక అక్కడనుంచి లేచి వెళ్ళింది.

"ఇదే అదను... ఒకటీ... ఎంతచక్కగా వుంది... ఎంత ఎర్రగా వుంది... గులాబీ... రెండూ... ఎవరూ...ఎవరూ... రాముడూ గౌరీ చూడటంలేదుకదూ... ముళ్ళు... అవును ముళ్ళన్నీ వాళ్ళవి .. పూవుమాత్రం నాది... మూడు... ఒచ్చిం దొచ్చింది. చేతిలో కొచ్చింది గులాబీ పువ్వు... ఎంత మెత్తగా వుంది పువ్వు. ఎంత ఆనందంగా వుంది మనసు... కొబ్బరిలేజు తిన్నట్లుగా... మీగడపెరుగు జుర్రి నట్లుగా..."

చేతిలో పూవుతో యింట్లోకి వచ్చివాలేడు భోగేశ్వరుడు. అతనిలో ఒకవిధమైన తృప్తి బయలుదేరి వంకరనవ్వుగా ముఖంమీద బయటపడింది. ఇలా అనుకొనేడతను "పిచ్చివాళ్ళు నెలరోజులు కష్టపడి, చమటకార్చేరు... మనది... ఒకటి, రెండూ, మూడూ... అంతే మూడే సెకన్లు చేతిలో పువ్వువాలింది... అలావుండాలి మనదెబ్బ"

రాముడు కామయ్యభార్య కనకమ్మవలన వుండిన భయంతో భోగేశ్వరప్రసాదుని ఏమీ చేయలేకపోయేడు.

అదీ అలా ప్రసాదుమనస్సులో ఒకముద్ర బలంగాపడింది. కాయలు కావాలంటే చెట్టెక్కనవసరంలేదు. తనకు పూలూ కావాలంటే చెట్లు పెంచనక్కరలేదు [illegible] లేదు. కాని పూలూ కాయలూ కూడా పొందగలడు.

* * *

పొందగలడుతను. పేకాటలో వేలు పొందగలడుతను కష్టపడకుండా యిష్టాలన్నీ తీర్చుకోగలడుతను. కాలం ముందుకుపోతోంది. భోగేశ్వరుడి వయస్సూ ముందుకుపోతోంది. అతని తల్లిదండ్రులుమాత్రం పైకిపోయేరు. అతనిభార్య సీతామహాలక్ష్మి మాత్రం పైకీ, ముందుకూకూడా పోకుండా అడ్డంగా పెరుగుతోంది. భోగేశ్వర ప్రసాదుమాత్రం రోజు ఠంచన్‌గా పదిగంటలబస్సుకి పట్నంవెళ్తున్నాడు. పేకాడి యిష్టమైనప్పుడు, డబ్బు అవసరమైనప్పుడు యింటికి తిరిగివస్తున్నాడు.

తండ్రికూడబెట్టినకాష్ కాస్తా హుష్‌అన్నట్టు మాయమయింది. మెల్లగా భూములమ్మటం మొదలెట్టేడు. ఈ సంవత్సరం పూరవతల తూర్పుపొలం బేరంపెడ్తే, మరుసటిసంవత్సరం పడమటి పల్లపుభూమి అమ్మజూసేడు. భార్య సీతామహాలక్ష్మి మొదట "ఈ ఆస్తి తరిగేదా. కరిగేదా, మగమహారాజు, ఏవో సరదాలు, అంతేకాని..." అని సరిపెట్టుకుంది కాని వ్యవహారం బెడిసికొట్టి శ్రుతిమించి రాగాపపడటం మొదలెట్టేసరికి భయపడి భర్తకి చెప్పిచూసింది.

"డబ్బుపోతే పోయింది. బంగారంలాంటి తాతలు సంపాదించిన భూములు మాత్రం అమ్మకండి"అని ప్రాధేయపడింది.

"పిచ్చిదానా! చూస్తూవుండు, ఎప్పుడో పట్టుకొస్తాను పోయినదానికి వడ్డీతో సహా. మన నాయుడి బావమరది 'చుక్క' తేడూ, వాడు పేకాటలో యెంత గెలిచేడో తెలుసా —"అంటూ భుజాన కండువావేసుకుని, జేబులో డబ్బువేసుకొని ఎంతగెలిచేడో చెప్పకుండానే పట్నంపోయే బస్సుకోసం పరుగెత్తేడు భోగేశ్వరప్రసాదు.

అతను అలా చాలాకాలం పేకాట, పెద్దదీ, యింకా పెద్దదీ, చాలా పెద్దదీ, అతిపెద్దదీకూడా ఆడి, ఆడి, ఓడి, ఓడి మరింక లాభంలేదనుకుని ఈ ఆట మనఒంటికి సరిపడదనుకుని, కొడ్తే జాక్‌పాట్‌కొట్టాలనుకుని మరికొంత భూమి అమ్మి గుర్రప్పందాలపై దృష్టిమళ్ళించేడు.

మద్రాసు, హైద్రాబాదు, బొంబాయి, బెంగుళూరు, హార్సురేసెస్ ఎక్కడుంటే అక్కడకు గుర్రంలా పరుగెత్తేడు.

భార్య మళ్ళీ చెప్పిచూసింది. భోగేశ్వరప్రసాదుకికూడా ఈమధ్య తన రాబోయే జయంమీద కొద్దిగా అపనమ్మకం కలిగినా ఆశమాత్రం వదులుకోక భార్యకిలాచెప్పేడు "నిన్న పేపర్లో ఏమిటిపడిందో తెలుసా?"

"ఏమిటిపడింది?"అన్నట్లు చూసింది సీతామహాలక్ష్మి.

"బొంబాయిలో ఒకతనికి గుర్రప్పందేలలో నలభై ఎనిమిది లక్షలొచ్చినట్లు పడింది. తగిలితే అట్లాంటిఛాన్సు తగలాలి"అని నలభైఎనిమిదిలక్షలూ గుర్తుకురావ

టంతో, ఆరోజు నిద్రపట్టక గడిపేడు. మరునాడులేచి ఎక్కడో గుర్రప్పందాలంటూ ప్రయాణం మొదలెట్టేడు.

ఆఖరికి మిగిలిన ముసలి మామిడితోట కూడా అమ్మేడు. జాక్‌పాట్ కాదుగదా ఇంట్లో పాట్‌లోకి బియ్యంకూడా దొరకటం కరువైపోయింది. గుర్రానికి పరుగెత్తి పరుగెత్తి కళ్ళేలు పడ్డాయి. ఎంతదూరం వచ్చిందీ అని చూసుకుంటే వెనక్కే పరుగెత్తింది కాని ముందుకి మాత్రం కాదని తెలిసేక, ఏమిచెయ్యాల్సిందీ తోచక ఏమి చెయ్యకుండా వుండేడతను. కాని అప్పులవాళ్ళు మాత్రం ఏమీ చెయ్యకుండా వుండలేదు. వాళ్ళు మిగిలిన స్థిరాస్తులనీ యిల్లు వాకిలీ కూడా స్వాధీనం చేసుకుని భోగేశ్వరప్రాసాదునీ, భార్య సీతామహాలక్ష్మినీ తన్నితగిలేసేరు.

* * *

"అయ్యో పాపం! ఇప్పుడు వాళ్ళు బిచ్చమెత్తుకుంటూ అష్టకష్టాలుపడుతుండాలి."

"కాదు అష్టయిశ్వర్యాలూ అనుభవిస్తున్నారు. శాస్త్రకారుడు చెప్పినట్టు కామిగాని వాడు మోక్షకామి కాదన్నట్టు, భోగి కానివాడు యోగికాడని తెలుసుకున్నవాడై, భోగేశ్వరుడు హఠాత్తుగా ఒకరోజున యోగీశ్వరుడయ్యేడు.

పూర్వాశ్రమంలో యోగీశ్వరుడి అనగా భోగీశ్వరుడి మనస్తత్వంగలవాళ్ళు— ఒక్కసారిగా పైకివెళ్ళాలనుకున్నవాళ్లు— ఒక్కసారిగా రెండు ప్రమోషన్లు పొందాలనుకునే ఆఫీసర్లు, మంత్రిపదవులుకోరుకునే రాజకీయవేత్తలు— తమ సినిమాలు బాక్సాఫీసు హిట్సుకావాలనుకునే తారలు. అటువంటివారు యావన్మందీకూడా యోగీశ్వరానందుల వారివద్దకు ప్రవాహంలా వస్తూంటారు. వారందరికీకూడా యోగీశ్వరులవారు తరతమ భేదంలేకుండా కాస్తంత బూడిద పంచిపెట్టి గాడిదల్ని చేస్తుంటారు.

"మరి అలనాటి రాముడో— అతడేమయ్యేడు."

"రాముడు యోగీశ్వరుల పూర్వాశ్రమం అంతాకూడా వివరించిచెప్పి. "వీడు యోగికాడు, భోగిగావుండి, భోగాలుపోగొట్టుకోని, యోగిగామారి మళ్ళీ ఆ భోగాలన్నీ పొందుతున్నవాడేగాని. మహాత్ముడేమీకాద"న్నందుకు యోగీశ్వరుడి శిష్యపరమాణువులు పోషకులు, భక్తులు, పాలకులందరూ రాముణ్ణి "వీడు నాస్తికుడు, విద్రోహి, దేశద్రోహి" అనేరు.

ఆ తరువాత రాముడు యోగులు, భోగులు ఐన రావణబ్రహ్మల రాజ్యంమీద— ఈ రాజ్యంమీదే, దండయాత్ర చెయ్యటానికి దండకారణ్యాలకుపోయేడు.

రాముణ్ణి పట్టుకున్నవారికి పదివేలు బహుమానం ప్రకటించింది ప్రభుత్వం.

ప్రజలదబ్బుని, ప్రజలమనిషిని పట్టుకునేందుకు బహుమానంగా ప్రకటించింది ప్రభుత్వం! అప్పటికీ, ఇప్పటికీ బీదప్రభుత్వానికి వదివేలు బహుమతి ఇవ్వాల్సిన యిబ్బంది కలుగలేదు.